పాత కడప చెరువులో వినియక నిమజ్జనం చేస్తున్న ప్రజలు

జెవివి జిల్లా అధ్యక్షులుగా సమీర్‌బాషా

ప్రజాశక్తి - కడప అర్బన్

జెవివి నూతన జిల్లా అధ్యక్షులు సమీర్ బాషను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎస్‌వి ఇంజినీరింగ్ కళాశాలలో జనవిజ్ఞాన వేదిక జిల్లా వార్షిక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన జిల్లా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 11వ బెటాలియన్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమీర్ బాషను జిల్లా నూతన అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో వైవీయూ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి, ఎస్‌వి.ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ వీర సుదర్శన్ రెడ్డి, డాక్టర్ ఓబుల్ రెడ్డి, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రఘునాథరెడ్డి, తవ్వా సురేష్, దేవదత్తం, వెంకటసుబ్బయ్య, సునీత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబయన్న, నగర ప్రధాన కార్యదర్శి శివరాం హాజరయ్యారు. సమీర్ బాష 2008లో జన విజ్ఞాన వేదికలో వేంపల్లి మండల ప్రధాన కార్యదర్శిగా అరంగేట్రం చేశారు. వేంపల్లిలోని శ్రీ రామ్ నగర్ లో(గుట్టమీద) ఉన్న ప్రాథమిక పాఠశాలలో దయ్యాలు, భూతాలు ఉన్నాయని తల్లిదండ్రులు పిల్లల్ని స్కూలుకు పంపించక నెల రోజులుగా స్కూలు మూతపడితే, తల్లిదండ్రులతో, ఉపాధ్యాయులతో అక్కడ స్థానికంగా ఉన్న నాయకులతో, మీడియాతో సమావేశాలు, అవగాహన సదస్సులు నిర్వహించి అపోహలను తొలగించి స్కూలును తిరిగి తెరిపించి తల్లిదండ్రులు,పిల్లల్ని స్కూలుకు పంపించే క్రమంలో కీలక పాత్ర పోషించారు. ఒంటిమిట్టకు బదిలీపై వచ్చిన తర్వాత అక్కడ మండల అధ్యక్షులుగా ఉండి పలు రకాల కార్యక్రమాలు చేపట్టి విద్యార్థులు, ప్రజలు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకునే విధంగా వాళ్లలో చైతన్యం తెచ్చారు. జన విజ్ఞాన వేదికలో మెజీషియన్‌గా, గాయకుడిగా కూడా ఉంటూ తన వంతు కృషి చేస్తూ ఎన్నో కార్యక్రమాల్లో మ్యాజిక్ ద్వారా, పాటల ద్వారా ప్రజల్లో మూఢనమ్మకాలను తొలగించడానికి విశేష కృషి చేస్తున్నారు. ఆ తరువాత జన విజ్ఞాన వేదికలో జిల్లా కార్యదర్శిగా, ఉపాధ్యక్షుడిగా, కోశాధికారిగా పనిచేసి సంఘం అభివృద్ధికి సేవలు అందించారు. ఆయన జిల్లా నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నిక కావడంతో పలు సంఘాలు, ఉపాధ్యాయులు, నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

నీరు ఎంతో విలువైంది

ప్రజాశక్తి - వల్లూరు

మానవ జీవితంలో నీరు ఎంతో విలువైందని వల్లూరు జడ్‌పిహెచ్ఎస్ ప్రధాన ఉపాధ్యాయులు డాక్టర్ కె.శ్రీనివాసులు అన్నారు. సోమవారం వల్లూరు జడ్‌పి పాఠశాలలో నీటి సమస్యలు, పరిష్కారాలు, మానవ జీవన సరళిలో నీటి ప్రాముఖ్యత అనే అంశంపై విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శ్యాంసుందర్ విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భిణికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

మాతా శిశు మరణాలు నివారించాలి

ప్రజాశక్తి- గోపవరం

మాతృ, శిశు మరణాలను నివారలించాలని మండల వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్, డాక్టర్ విశ్వంత పేర్కొన్నారు. బద్వేల్ మండలంలోని తొట్టిగారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం ప్రధానమంత్రి మాతృత్వ అభయాన్ సురక్షిత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని గర్భిణులకు సకాలంలో వైద్య పరీక్షలు చేయాలన్నారు. కష్టతరమైన గర్భిణులను గుర్తించి సరైన సమయంలో సరైన చికిత్సను అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. సీషనల్ వ్యాధులు మలేరియా, డెంగీ వంటి వాటిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని చెప్పారు. అనంతరం గర్భిణులకు పోషకాహారం అందజేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు ఎడ్యుకేటర్ బి వెంగయ్య, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కె.చంద్రావతి, విలేజీ హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్, హెల్త్ సూపర్‌వైజర్ కె. వెంకటమ్మ, హెల్త్ అసిస్టెంట్ జనార్ధన, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశక్తి - కడప : ఈనెల 14వన జిల్లా వ్యాప్తంగా నిర్వహించే జాతీయలోక్ అదాలత్‌ను కక్షిదారులు, ప్రజలు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం పొందాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్ జి. శ్రీదేవి, సీనియర్ సివిల్ జడ్జి, డిఎల్ఎస్ఎ సెక్రటరీ ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. పూర్తి సమాచారం కోసం: 08562 258622, 244622లలో సంప్రదించాలన్నారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

ప్రజాశక్తి - కడప

రక్తదానం చేస్తున్న ఎన్‌సిసి విద్యార్థులు

ఆపదలో ఉన్నవారికి రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ అధికారి కల్నల్ సూర్య నారాయణ మూర్తి అన్నారు. కడప నగరంలోని తెలుగు గంగ కాలనీలో నిర్వహి స్తున్న కంబైండ్ అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా సోమవారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా క్యాంపు కమాండింగ్ అధికారి కల్నల్ సూర్య నారాయణ మూర్తి మాట్లాడుతూ ప్రతి ఆరోగ్యవంతమైన పౌరుడు మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని అన్నారు.30 మంది క్యాడెట్లు రక్తదానం చేశారు. కార్యక్రమంలో కడప ప్రభుత్వ వైద్యశాల బ్లడ్ బ్యాంక్ నిర్వహణ అధికారి ప్రొఫెసర్ రాజేంద్రప్రసాద్, క్యాంపు డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ డాక్టర్ నీలయ్య, ఎన్‌సిసి అధికారులు లెఫ్టినెంట్ మహేష్, శివరాం, గంగాధర్, నాగరాజు నాయక్, స్వామినాథ్ పరేడ్ శిక్షకులు సుబేదార్ మేజర్ అనిల్‌కుమార్, సి.ఎల్.ఎన్. రెడ్డి, కొండారెడ్డి, బస్నెట్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలు వద్దు.. ఆరోగ్యమే ముద్దు

ప్రజాశక్తి - వల్లూరు : విద్యార్థులు మాదకద్రవ్యాలకు అలవాటు పడి ఆరోగ్యపరమైన సమస్యలకు లోనవుతున్నారని వల్లూరు ఎస్ఐ సంజీవ రాయుడు అన్నారు. గంగాయపల్లి పీఎం శ్రీ ఆదర్శ పాఠశాలలో మదర్ థెరిసా సేవా సమితి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జూటూరు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల నిర్మూలన పక్షోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కళాశాల విద్యార్థులకు గంజాయి మత్తు మాదకద్రవ్యాలపై అవగాహన సదస్సు కల్పించామని చెప్పారు. మత్తు పదార్థాలకు అలవాటు పడి విద్యార్థులు, యువకులు చదువును నిర్లక్ష్యం చేస్తూ విద్యను కోల్పోతున్నారన్నారు. చాలామంది మత్తు పదార్థాలకు బానిసలై మహిళలు విద్యార్థుల పట్ల అసభ్యంగా ప్రవర్తించడం దొంగతనాలు అలవాటు పడుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ షాకీర్ హుస్సేన్, ప్రిన్సిపల్ సురేష్ బాబు, సూలం లక్ష్మీదేవి, వసంత్, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

గణేష్ నిమజ్జనంలో అపశృతి

- మొగమూరు నదిలో పడి వేంపల్లెకు చెందిన ఇద్దరు మృతి

- శోక సంద్రంలో కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి - వేంపల్లె (వీరపునాయునిపల్లె)

వీరపునాయునిపల్లె మండలం పాలగిరి క్రాస్‌లో ఉన్న మొగమూరు నదిలో నిర్వహించిన గణేష్ ప్రతిమల నిమజ్జనంలో అపశృతి చోటు చేసుకుంది. నిమజ్జనం కోసం వెళ్లిన వేంపల్లెకు చెందిన పాలూరు వంశీ (24), జరిపిటి రాజా (40) అనే ఇద్దరు యవకులు మృతి చెందారు. స్థానికులు, బంధువుల వివరాల మేరకు.. వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీలో నివాసం ఉంటున్న పాలూరు జయన్నకు నలుగురు పిల్లలు ఉండగా వారిలో చిన్న కుమారుడైన వంశీ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. శ్రీ చైతన్య పాఠశాల సమీపంలో నివాసం ఉంటున్న జరిపిటి రాజా అనే వ్యక్తి బిల్డర్‌గా పని చేసుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి నలుగురు పిల్లలు, భార్య కూడ ఉంది. మూడు రోజుల కిందట వినాయక చవితి పండుగను పురస్కరించుకుని వినాయక ప్రతిమను రాజా నివాసం ఉండే ప్రాంతంలో ఏర్పాటు చేశారు. సోమవారం నిమజ్జనం సందర్భంగా వినాయకునికి వేంపల్లెలో ఊరేగింపు చేసేందుకు క్రిష్టియన్ కాలనీలో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్ వంశీ వెళ్లారు. ఊరేగింపు తర్వాత వినాయక ప్రతిమను నిమజ్జనం చేసేందుకు వీరపునాయునిపల్లె మండలం పాలగిరి క్రాస్ సమీపంలో ఉన్న మొగమూరు నది వద్దకు వెళ్లారు.. వినాయకుని నిమజ్జనం చేసే సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి వారి ఇరువురు నదిలో పడిపోయారు. వారిని కాపాడేందుకు స్థానికులు ప్రయత్నించి విఫలం చెందారు. ఇద్దరూ నీటిలో గల్లంతు కావడంతో బంధువులకు, పోలీసులకు గట్టుపై ఉన్న వారు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో వీరపునాయునిపల్లె మండల పోలీసులు గజ ఈతగాళ్లను పిలిపించి మొగమూరు నదిలో వెతికించారు. దీంతో ముందుగా నది పూడులో ఇరుక్కొన్న వంశీ మృతదేహాన్ని నీటిలో నుంచి బయటి తీశారు. కొద్ది సేపటికి తర్వాత రాజా మృత దేహాన్ని వెలికి తీశారు. ఇరువురి కుటుంబ సభ్యులు, బంధువులు, తల్లి దండ్రులు కన్నీరు మున్నీరుగా విల పిం చారు. వేంపల్లెలోని క్రిష్టియన్ కాలనీ, శ్రీచైతన్య పాఠశాలవీధిలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఇద్దరు వ్యక్తులు మొగమూరునదిలో గల్లంతు అయిన విషయం తెలియడంతో చుట్టూ ప్రక్కల గ్రామాల ప్రజలు భారీగా సంఖ్యలో మొగమూరు నది వద్ద చేరుకున్నారు. ఇరువురి మృత దేహాల కోసం గజ ఈతగాళ్లు దాదాపు 4 గంటల సేపు మొగమూరు నదీలో వెతికారు. బయటికి తీసిన మృతదేహాలను వేంపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మృతి చెందిన రాజా, వంశీ (ఫైల్‌ఫొటోలు)

'ఉక్కు'ను ఏర్పాటు చేసే వరకూ పోరాటం

- డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని

ప్రజాశక్తి - బద్వేలు

జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలని లేకపోతే, ఉద్యమిస్తూనే ఉంటామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని అన్నారు. సోమవారం స్థానిక సుందరయ్య భవనంలో డివైఎఫ్ఐ పట్టణ నాయకులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ విభజన చట్టంలో పొందుపరిచిన టువంటి హామీలలో ఒకటైన కడప జిల్లాలో ఉక్కు పరిశ్ర మను ఏర్పాటచేయాలని ఉన్నప్పటికీ ఉక్కు పరిశ్రమ సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. జిల్లాలో చదువుకుని ఉద్యోగాలు రాక నిరుద్యోగులు ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలసలు వెళుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వాలు ఎన్నికల ముందు కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేస్తామని అవసరమైతే తమ ఎంపీలు చేత కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని హామీలు ఇచ్చి తరువాత నెరవేర్చకుండా నిరుద్యోగుల జీవి తాలతో చెలగాటం ఆడుతున్నారని వారు రాష్ట్ర ప్రభుత్వం పైన మండిపడ్డారు. రాష్ట్రంలో ఉన్నటు వంటి ఎంపీలు రాజ్యసభ సభ్యులు పార్లమెంట్ సమావేశాల్లో కడప ఉక్కు పరిశ్రమ పైన మాట్లాడకపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రాయలసీమ ప్రాంతంలోని కడప జిల్లాలో ఉన్నటువంటి నిరుద్యోగులు ఉద్యోగ అవకాశాలు లేక ఆత్మహత్యలు చేసుకునేటువంటి పరిస్థితికి తెచ్చారని, చాలామంది ఉద్యోగుల కోసం ఎదురుచూసి ఉద్యోగాలు రాకపో వడంతో చాలామంది నిరుత్సాహ పడుతున్నారని వారన్నారు. ఇప్పటికైనా రాష్ట్రం కేంద్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొచ్చి కడప జిల్లాలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నారు. లేకపోతే డివైఎఫ్ఐ యువజన సంఘం ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీలను ప్రజా సంఘాలను కలుపుకొని ఉక్కు పరిశ్రమ వచ్చేంతవరకు పోరాడుతామన్నారు. అనంతరం డివైఎఫ్ఐ బద్వేల్ నూతన కమిటీ ఎన్నుకున్నారు. డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్షులుగా ఎస్.కె. మస్తాన్ షరీఫ్, పట్టణ కార్యదర్శిగా ఎస్.కె. ఆదిల్, ట్రెజరీగా చల్లా నాగలక్ష్మి, ఉపాధ్యక్షులుగా ఎస్.కె. ఫాతిమా, సురేష్, ఇమ్మానుయేలు, యువరాజ్ సహాయ కార్యదర్శులుగా ఖలీల్, షరీఫ్ శివకుమార్ నాగేంద్ర, నాగేశ్వరి, నరసింహ, కమిటీ సభ్యులుగా మహేష్, రాజు, ప్రసాద్ రెడ్డి, మరో పది మందిని ఎన్నుకున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు చిన్ని

వివీయూ సందర్శనలో ఇంటాక్ ప్రతినిధులు

వైవీయూను సందర్శించిన ఇంటాక్ ప్రతినిధులు

ప్రజాశక్తి -కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయాన్ని ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఇంటాక్) వైయస్సార్ జిల్లా ప్రతినిధులు విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఆర్ట్ గ్యాలరీని సందర్శించారు. గ్యాలరీలో అద్భుతమైన చిత్రకళ ఉందని చారిత్రక నేపథ్యం కనిపిస్తుందన్నారు. బొటానికల్ గార్డెన్‌లోని జెయింట్ వాటర్ లిల్లీ, అనేక రకాల మొక్కల్ని పరిశీలించారు. అనంతరం ఒక కులపతి విసి ఆచార్య కె. కృష్ణారెడ్డిని కలిసి ముచ్చటించారు. విశ్వవిద్యాలయంలో ఉన్న ప్రత్యేకతలను తెలుసుకున్నారు. టూరిజం సర్క్యూట్‌లో విశ్వవిద్యాలయాన్ని కూడా ఒక భాగం చేస్తామని ఈ సందర్భంగా చెప్పారు. అనంతరం లలిత కళల శాఖ విభాగాధిపతి డాక్టర్ కోట మృత్యుంజయరావుకు సన్మానం చేశారు. ఇన్ టాక్ జిల్లా చాప్టర్ కన్వీనర్ లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య పూర్వ అధ్యక్షులు పోతుల వెంకట్రామిరెడ్డి, సభ్యులు లయన్ పి.సంజీవరెడ్డి, బాల ఎల్లారెడ్డి, ఎస్ ఎండి బాష, గంగాధర్, రాఘవేంద్ర వర్మ, పవన్ కుమార్ పంతులు హాజరయ్యారు.

అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కడప అర్బన్ : కోటిరెడ్డి ప్రభుత్వ మహిళా కళాశాలలో 21 రోజుల పాటు కొనసాగే స్టూడెంట్ ఇండక్షన్ ప్రోగ్రాంలో భాగంగా సోమవారం డిజిటల్ లిటరసీపై పై కళాశాలలో చేరిన నూతన విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. సలీం బాషా తెలిపారు. రిసోర్స్ పర్సన్ గా కంప్యూటర్ సైన్స్ విభాగధిపతి హరిత హాజర య్యారు. జిటల్ లిటరసీ, కంప్యూటర్ ఆవశ్యకత గురించి విద్యార్థులకు తెలియ జేశారు. సౌమ్యం అనే పోర్టల్‌లో రిజిస్టర్ అయి అందులో ఉన్న కోర్స్‌లను నేర్చుకోవచ్చని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐపి కో-ఆర్డినేటర్ డాక్టర్ కె. ప్రకాష్, నారాయణ రెడ్డి, డాక్టర్ గురుమోహన్ రెడ్డి, కుమార్ పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాల కౌన్సెలింగ్ పరిశీలన

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ కళాశాల ప్రవేశాల ప్రక్రియను విశ్వవిద్యాలయ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథరెడ్డి పరిశీలించారు. ఏపీ పీజీ సెట్ అర్హత సాధించి వైవీయూలో సీట్లు పొందిన వారు సంచాలకుల కార్యాలయానికి వచ్చారు. డిఒఎ సంచాలకులు డాక్టర్ లక్ష్మీప్రసాద్ మార్గదర్శకంలో విద్యార్థుల అర్హత పత్రాలు పరిశీలన చేసి సీట్లు కేటాయిస్తున్నారు. విసి రిజిస్ట్రార్లు విద్యార్థులతో మాట్లాడారు. ఇబ్బందుల గురించి ఆరా తీశారు. సంచాలకులు డాక్టర్ లక్ష్మి ప్రసాద్ స్పందిస్తూ తొలి విడతలో 363 మంది విద్యార్థులు వైవీయూ కళాశాలకు ఆప్షన్ ఇచ్చుకున్నారని అందులో 260 మంది ఇప్పటికే ప్రవేశాలు పొందాలని తెలిపారు. ఈ నెల 4 నుంచి ప్రవేశాల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోందన్నారు. ప్రవేశాల ప్రక్రియలో డిఒఎ సహాయ సంచాలకులు డాక్టర్ వి.రామకృష్ణ, డాక్టర్ మునికుమారి, డాక్టర్ వసుగోవర్ధన్‌రెడ్డి, రెడ్డయ్య, డాక్టర్ గణేష్ నాయక్ , సిబ్బంది పాల్గొన్నారు

గణపతి ఉత్సవాల్లో అన్నదానం

ప్రజాశక్తి - కడప అర్బన్ : గణపతి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అరవిందనగర్‌లో అన్నదానం నిర్వహించారు. చిన్నపిల్లలు విగ్రహ ఏర్పాటుకు అవసరమైన నిధులను సమీకరించి భక్తిశ్రద్ధలతో గణనాథుని పూజించారు. నిమజ్జనం సందర్భంగా అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించారు. కార్యక్రమంలో చంద్రమోహన్ రాజు, హర్షిల్ రాజు, మోతిన్ రాజు, పిల్లలు, పెద్దలు పాల్గొన్నారు.

అన్నదానం కార్యక్రమంలో చిన్నారులు

రెగ్యులర్ వ్యవసాయాధికారి లేక ఇక్కట్లు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

మండలంలో రెగ్యులర్ వ్యవసాయాధికారి లేక పోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు పనిచేస్తున్న వ్యవసాయ శాఖ అధికారి శివ మోహన్‌రెడ్డి విజయనగరం జిల్లా నుంచి డిప్యుటేషన్‌పై ఇక్కడ విధులు నిర్వహించేవారు. ఎన్నికల సందర్భంగా డిప్యుటేషన్ రద్దు కావడంతో ఆయన మళ్లీ విజయ నగరం జిల్లాకు వెళ్లారు. దాదాపు నాలుగు నెలలుగా వ్యవసాయ అధికారి లేక రైతులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్ ప్రారంభం నేపథ్యంలో పంటల తెగుళ్ల, నివారణకు సలహాలు ఇచ్చే అధికారి లేకపోవడంతో తీవ్రంగా నష్టపోతున్నామని రైతులు వాపోతున్నారు.

యథేచ్ఛగా నిషేధిత మందుల విక్రయాలు..

మండల వ్యవసాయ శాఖ అధికారి లేకపోవడంతో మండలంలో ఎరువులు, పురుగు మందుల డీలర్లు ఆడిందేఆట.. పాడిందేపాటగా నడస్తోందని రైతులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా ప్రభుత్వం యూరియా రూ.267కు విక్రయించాలని చెబుతున్నప్పటికీ డీలర్లు మాత్రం రూ.300కు అమ్ముతున్నారు. అంతేకాక నిషేధిత గడ్డి మందులు(గ్లైసిల్) అమ్మకాలు యథే చ్ఛగా సాగుతున్నాయి. కొన్ని రకాల కంపెనీల క్రిమి సంహారక మందులు సైతం నకిలీ మందులను రైతులకు అంటగడుతున్నట్లు సమా చారం. మండలంలో రెగ్యు లర్ వ్యవసాయ అధికారిని నియమించి, నిషేధిత మందులు విక్రయాలు జరగ కుండా చర్యలు తీసుకో వాలని రైతులు కోరు తున్నారు. ఈ విషయమై ముద్దనూరు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకట సుబ్బయ్యను వివరణ కోరగా.. త్వరలోనే వ్యవ సాయ శాఖ అధికారి నియ మిస్తామన్నారు. నిషేధ గడ్డి మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎరువులు ఎమ్మార్పీకే విక్రయిం చాలన్నారు. యూరియా అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు బిల్లులతో ఫిర్యాదు చేస్తే ఆ డీలర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం

ప్రజాశక్తి - కడప అర్బన్

వినాయక చవితి పండుగను పురస్కరించుకుని నగరంలో పెద్ద ఎత్తున వినాయక విగ్రహాలను ప్రజలు ఏర్పాటు చేశారు. సోమవారం వినాయక పండగ మూడో రోజు కావడంతో నిమజ్జనానికి సన్నద్ధమయ్యారు. డప్పులు, మేళ తాళాలు, రంగులు, బాణాసంచా, గణపతి పప్పా మోరియా అంటూ నిమజ్జనానికి పయనమయ్యారు. పాత కడప చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జనానికి పోలీస్, రెవెన్యూ, కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు చెరువు కట్ట వెంబడి బారీకేడ్లు ఏర్పాటు చేశారు. వినాయక విగ్రహాలను ప్రజలు వాహనాలలో చెరువు కట్ట వద్దకు తీసుకువచ్చి భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. ఎస్‌పి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు చిన్నచౌకు రిమ్స్ పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. సిఐలు తేజ మూర్తి వెంకటేశ్వర్లు ఎస్సై రవికుమార్ పోలీస్ సిబ్బంది విగ్రహాల నిమజ్జనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్ట చర్యలు తీసుకున్నారు. కార్పొరేషన్, ఫైర్ సిబ్బంది చెరువు నీటిలో దిగి వినాయక విగ్రహాలను నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ, విద్యుత్, కార్పొరేషన్ సిబ్బంది పాల్గొన్నారు. **విజయదుర్గ కాలనీలో..** కడప నగరంలోని విజయ దుర్గ కాలనీలోని 4వ రోడ్డులో శ్రీ వరసిద్ధి వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని ఘనంగా నిమజ్జనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో కాలనీ ప్రముఖులు గోవిందు నాగరాజు, ఆర్.సుధాకర్, ఎ.సి. కొండారెడ్డి, పల్లా రాధాకృష్ణ, సిఆర్ఐ సునీల్ జయంత్, ఇట్టే వేణుగోపాల్, పట్టుపోగుల రాము, సిఆర్ఐ పెద్ద సుబ్బరాయుడు, రాజారెడ్డి, సుదర్శన్ రెడ్డి, తిమ్మా రెడ్డి సాంబశివరెడ్డి, సుబ్బన్న, గుత్తి వేణు, రఘునాథ్ నాయుడు, విజయదుర్గా కాలనీ వాసుల ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **ఒంటిమిట్ట :** మండల పరిధిలోని దాదాపు 40 గ్రామాలలో ప్రజలు భక్తిశ్రద్ధలతో అన్ని గ్రామాలలో వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసుకున్నారు మూడు రోజులు పాటు అన్ని గ్రామాల్లో విగ్రహాలకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించి సోమవారం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఒంటిమిట్ట సిఐ కృష్ణంరాజు నాయక్ ఆధ్వర్యంలో సిద్ధవటం హై లెవల్ బ్రిడ్జి దగ్గర విగ్రహాల నిమజ్జనం చేశారు.

ప్రజా సమస్యలు వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్

ప్రజా సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్రం అన్నారు. సోమవారం కడప నగర పాలక సంస్థ - ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలు తమ సమస్యలు, అభ్యర్థనలను విపులంగా చర్చించారు. సకాలంలో సమస్యలు పరిష్కరించడంలో నగరపాలక సంస్థ శ్రద్ధ చూపుతుందని తెలిపారు. ప్రజల సహకారంతో నగరాన్ని మరింత అభివృద్ధి దిశగా తీసుకువెళ్లేందుకు కృషి చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ శ్రీనివాసులు, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ చంద్రశేఖర్, సిటీ ప్లానర్ సూరజ్, శాఖధిపతులు, నగరపాలక సిబ్బంది పాల్గొన్నారు.

రేపు అండర్-14 క్రికెట్ జిల్లా జట్టు ఎంపికలు

ప్రజాశక్తి - కడప

ఈనెల 11న అండర్ 14- పురుషుల కడప జిల్లా జట్టు ఎంపికలు కడప నగరంలోని వై.ఎస్. రాజారెడ్డి స్టేడియంలో ఉన్న క్రికెట్ నెట్స్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి ఎ. రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంపికల్లో పాల్గొనాలని కోరారు. జిల్లా క్రికెట్ జట్టు ఎంపికలకు హాజరయ్యే క్రీడాకారులు తమతో పాటు ఆధార్ కార్డు, జన్మదిన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజ్ ఫొటో, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో, మూడు సంవత్సరాల ప్రోగ్రెస్ రిపోర్టు తీసుకురావాల్సి ఉంటుందన్నారు. ఎవరి క్రికెట్ కిట్ వారే తెచ్చుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

జగన్‌కు ప్రజలే బుద్ధి చెప్పారు : టిడిపి

ప్రజాశక్తి - కడప అర్బన్

చంద్రబాబు అక్రమ అరెస్ట్‌కు నేటితో ఏడాది పూర్తయిందని, అందుకే వైసిపికి ప్రజలు గట్టి బుద్ధి చెప్పారని టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు ఆర్. శ్రీనివాసరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 53 రోజులపాటు జైల్లో పెట్టి ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. ఏడాది సెప్టెంబర్ 9న రాష్ట్ర ప్రజానీకం అంతా కన్నీరు పెట్టుకుందని పేర్కొన్నారు. ఇదే సెప్టెంబర్ 9న ఇప్పుడు ప్రజల కోసం సిఎం పరితపిస్తున్నారని తెలిపారు. వరద బాధితుల రక్షణ కోసం అహర్నిశలు కష్టపడుతున్నారని పేర్కొన్నారు. పండగ రోజుల్లో కూడా రాష్ట్ర ప్రజల కోసం పరితపిస్తున్న వ్యక్తి సీఎం చంద్రబాబు అని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నవ్యాంధ్రప్రదేశ్ పునర్నిర్మాణమే లక్ష్యంగా పనిచేస్తుందని తెలిపారు. వృద్ధాప్య పింఛన్ రూ. 4వేల పెంచడం, 16347 ఉద్యోగాలతో మెగా డిఎస్‌సి, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ప్రజా రాజధాని అమరావతి, పోలవరం నిర్మాణం, ప్రకృతి విపత్తుల సమర్థ నిర్వహణ వంటి వాటిపై దృష్టి పెట్టారని పేర్కొన్నారు. ఐదేళ్ల జగన్ పాలన లూటీలు, నేరాలు, కక్షలకు, కార్పన్యాలతో కాలం వెలబుచ్చితే, కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా ముందుకెళుతుందని తెలిపారు.

డయల్ యువర్ కలెక్టర్‌కు ఏడు ఫిర్యాదులు

ప్రజాశక్తి - కడప

డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమానికి విశేష స్పందన, సత్వర పరిష్కారం లభించింది. సోమవారం ఉదయం 9.30 నుంచి 10.30 గంటల వరకు కలెక్టర్ శివశంకర్ లోతేటి నిర్వహించిన కార్యక్రమంలో మొత్తం ఏడుగురు మంది ఫోన్ ద్వారా తమ సమస్యలను విన్నవించారు. ఫిర్యాదులకు సంబంధించిన శాఖల అధికారులతో వెంటనే మాట్లాడి తక్షణమే చర్యలు తీసుకోవాలని కడప ఇన్‌ఛార్జి ఆర్‌డిఒ వెంకటపతి ఆదేశించారు. కడప మండలం, పాత కడప ఇందిరా పురానికి చెందిన కె. అనూష తమ ప్రాంతంలోని అంగన్వాడీ కేంద్రంలో 7 నెలలుగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్ట్ తనకు ఇవ్వాలని కోరారు. వేముల మండలం పెద్ద జుటూరుకు చెందిన ఎస్. బాలిరెడ్డి సర్వే నెం. 268/ఎ1 లో 4 ఎకరాలు పెద్ద జుటూరు గ్రామంలో 50 ఏళ్ల కిందట కొనుగోలు చేశానని సదరు భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కోరారు.

కొనసాగుతున్న క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - కడప

ఆరు వికెట్లు తీసిన అఖిల్

జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎసిఎ సౌత్ జోన్ అండర్ -23 మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా సోమవారం వై.ఎస్ రాజారెడ్డి ఎసిఎ స్టేడియంలో చిత్తూరు, అనంతపురం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 84.0 ఓవర్లలో 307 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని మహేంద్ర రెడ్డి 91, వీరారెడ్డి 64 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని రెడ్డి ప్రకాష్ 3, జావీద్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటి రోజు ఆటో ముగిసే సమయానికి 4.0 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 19 పరుగులు చేసింది. కెఎస్ఆర్ఎం క్రికెట్ మధ్యాహ్నం లో కడప, నెల్లూరు జట్లు తలపడుతున్నాయి. టాస్ గెలిచి బ్యాటింగ్ కు దిగిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్ లో 62.2 ఓవర్లలో 222 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. ఆ జట్టులోని స సరణ్ 52 పరుగులు చేశాడు. నెల్లూరు జట్టులోని అఖిల్ అద్భుతంగా బౌలింగ్ ప్రదర్శించి 6 వికెట్లు తీసుకున్నాడు. అనంతరం బ్యాటింగ్ కోదిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 27 ఓవర్లలో రెండు వికెట్ల నష్టానికి 102 పరుగులు చేసింది.

నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు

నిమజ్జనంలో అప్రమత్తంగా ఉండాలి

- ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు

ప్రజాశక్తి - చాపాడు

నిమజ్జనం పూర్తయ్యే వరకూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పి హర్షవర్ధన్ రాజు ఆదేశించారు. మండల పరిధిలోని అల్లాడుపల్లె కుందూ నది పాత వంతెనను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ ప్రాంతంలో వినాయక నిమజ్జన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా వాహనాల పార్కింగ్, లైటింగ్, బారికేడ్లు వంటి వాటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నదిలో నీరు అధికంగా ప్రవహిస్తుందని, ఎట్టి పరిస్థితులలో ప్రజలు దిగకుండా చూడాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వాహనాలను నిమజ్జనానికి అనుమతించాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీఒ శ్రీనివాస్, డిఎస్పి రాజేంద్రప్రసాద్, సిఐ జె శివశంకర్, ఎస్ఐ చిన్న పెద్దయ్య, ఎంపీడీవో శ్రీధర్ నాయుడు, ఈవోపీఆర్‌డి రాధాకృష్ణవేణి, డిటి యామిని, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, స్థానిక టిడిపి నాయకులు గోసుల కృష్ణారెడ్డి, వీరారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) : మండలంలోని కామనూరు కుందు నది వంతెన వద్ద ఏర్పాటు చేసిన వినాయక నిమజ్జన బందోబస్తును ఎస్పి హర్షవర్ధన్ రాజు సోమవారం పరిశీలించారు. ప్రొద్దుటూరు డిఎస్పి భక్తవత్సలంతో బందోబస్తుపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో రూరల్ సిఐ బాల మద్దిలేటి, ఎస్ఐ మహమ్మద్ రఫీ ఉన్నారు.

నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు

బ్రహ్మంగారి మఠం : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎస్పి వి.హర్షవర్ధన్‌రాజు సిబ్బందిని హెచ్చరించారు. సోమవాం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదును నమోదు చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలు శుభ్రంగా ఉంచాలన్నారు. పలు రికార్డులను ఎస్పి పరిశీలించారు. కార్యక్రమంలో మైదుకూరు డిఎస్పి రాజేంద్రప్రసాద్ మైదుకూరు రూరల్ సిఐ శివశంకర్, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఆస్తుల బిల్లును వెనక్కి తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

ప్రజలతో మెసేజ్ పంపిస్తున్న ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు

కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులను కాజేసేందుకు తెచ్చిన బిల్లును వెనక్కి తీసుకోవాలని ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా కో-ఆర్డినేటర్ రహంతుల్లా డిమాండ్ చేశారు. సోమవారం వక్ఫ్ బోర్డు ఆస్తులను వక్ఫ్‌బోర్డు పరిధిలోనే ఉండాలని, కేంద్ర ప్రభుత్వానికి ఆన్‌లైన్ ద్వారా ముస్లింలతో కలిసి మెసేజ్‌లను ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు పంపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు ఆస్తులపై కేంద్ర ప్రభుత్వం తెచ్చిన బిల్లును ముస్లింలంతా వ్యతిరేకిస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా మెసేజ్‌లు పంపేందుకు ముస్లింలకు అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. తమ సెల్‌ఫోన్ ద్వారా బిల్లుకు వ్యతిరేకంగా మెసేజ్ పంపాలని కోరారు. ముస్లింలకు సంబంధించిన వక్ఫ్ బోర్డు ఆస్తులపై కన్ను వేసి కేంద్ర ప్రభుత్వం బిల్లును ప్రవేశ పెట్టడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డు ఆస్తులపై తెచ్చిన బిల్లును రద్దు చేయాలని పార్లమెంటులో ప్రతిపక్ష పార్టీ కాంగ్రెస్‌తోపాటు 28 పార్టీల ఎంపీలు కోరినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. అన్ని మతాల ఆస్తులను ఆక్రమించి అదాని, అంబానీలకు కట్టబెట్టేందుకు ప్రధాని మోడీ ప్రయత్నాలు చేస్తున్నట్లు ఆరోపించారు. కార్యక్రమంలో ఆమ్‌ఆద్మీ పార్టీ నాయకులు అహమ్మద్, బాబ్జీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చిన్న రెడ్డయ్యపై కేసు నమోదు చేయండి..!

- పోలీసులకు సహాయ కమిషనర్ ఫిర్యాదు

ప్రజాశక్తి - చక్రాయపేట

తాగునీటిలో చిన్న రెడ్డయ్య పౌడర్ కలుపుతున్నట్లు సీసీ కెమెరాల్లో నమోదు

పవిత్ర పుణ్యక్షేత్రమైన గండి క్షేత్రంలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్న కొమెర చిన్న రెడ్డయ్యపై కేసు నమోదు చేయాలని సోమవారం గండి దేవస్థాన సహాయ కమిషనర్ జె.వెంకటసుబ్బయ్య ఆర్వేంపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. ఈనెల 6న గండి క్షేత్రంలో మనీ స్కేల్ కింద పనిచేస్తున్న ఉద్యోగి జంబు రెడ్డయ్య తాగే నీళ్ల బాటల్లో వంట మాస్టర్ చిన్న రెడ్డయ్య పౌడర్ కలిపినట్లు సీసీ కెమెరాల ద్వారా నిర్ధారణ అయింది. కొమర చిన్న రెడ్డయ్యపై ఫిర్యాదు చేసినట్లు ఇఒ తెలిపారు. పౌడర్ నీళ్ల తాగిన జంబురెడ్డయ్యకు విరేచనాలు, వాంతులు, బేదులు పెట్టడంతో సీసీ కెమెరాలు పరిశీలించామన్నారు. దీంతో వంట మాస్టర్ రెడ్డయ్య చేసిన బండారం బయటపడిందని ఆయన తెలిపారు. పవిత్రమైన పుణ్యక్షేత్రంలోనే ఉద్యోగస్తులు ఇలా చేసుకోవడంతో పలువురికి ఆశ్చర్యం కల్పించిందని.. ఏదేమైనా ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ఇఒ కోరారు.

జనరల్ స్టోర్‌లో చోరీ

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని తాడిపత్రి ప్రధాన రహదారిలోని ఉమ్మారెడ్డిపల్లె గ్రామ సమీపంలో ఉన్న హర్ష జనరల్ స్టోర్‌లో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. స్టోర్‌లో రూ.7వేలు నగదు, సిసి కెమెరాలో ఉన్న మెమోరీ కార్డు, సిమ్, తిను బండారాలు చోరీకి గురైనట్లు స్టోర్ యజమాని హర్షవర్ధన్ రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనాస్థలాన్ని ఎస్ఐ మైనుద్దీన్ పరిశీలించారు.

భవితకు భద్రత ఏదీ..!

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

పరిమితికి మించి ఆటోలో ప్రయాణిస్తున్న విద్యార్థులు

ఎర్రగుంట్ల పట్టణంలో ఉన్న ఆటో డ్రైవర్ల ప్రవర్తన రోజు రోజుకూ శృతి మించిపోతోంది. ఆటోల్లో పెద్దపెద్ద సౌండ్ బాక్స్‌లు పెట్టడం, ద్వంద్వ అర్థాలు వచ్చేలా పాటలు పెట్టడం, పెడ అర్థాలు వచ్చేలా ఆటోల వెనుక స్లోగన్స్ తదితర వాటితో వ్యవహరిస్తున్నారు. ఆటోల్లో వెళ్లాలంటేనే ప్రజలు హడలెత్తి పోతున్నారు. అంతేకాకుండా ట్రాఫిక్ నిబంధనలకు వ్యతిరేకంగా పట్టణంలో ఎక్కడ పడితే అక్కడ బస్సుల ముందు, వెనుక ఆటోలు నిలపడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది ఆటో డ్రైవర్లు మద్యం తాగి, గుట్కాలు నమలడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలతో ఇంకొందరు ఆటో డ్రైవర్లు ఆటలాడుతున్నారు. ఒక్కో ఆటోలో పరిమితికి మించి విద్యార్థులను ఎక్కించుకోకూడదనే నిబంధనలు ఉన్నా.. వాటిని తుంగలో తొక్కేస్తున్నారు. పరిమితికి మించి విద్యార్థులను కుక్కేసి పాఠశాలలకు తీసుకెళ్తున్నారు. ఇది చూసినా పాఠశాలల యాజమాన్యం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. ఎంత ఎక్కువ మంది విద్యార్థులు ఉంటే అంత ఎక్కువ మొత్తం డబ్బు వస్తుందనే ఆశతో కొందరు డ్రైవర్లు పరిమితికి మించి పిల్లలను ఆటోలో ఎక్కిస్తున్నారు. దీని వల్ల ఆటో అద్దె తగ్గుతుం డడంతో విద్యార్థుల తల్లిదండ్రులు కూడా పట్టించుకోవడం లేదు. ఏదైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని పలువురు ప్రశ్నిస్తున్నారు. చాలా ఆటోలకు ఫిట్‌నెస్ లేకపోయినా రోడ్డుమీద తిప్పుతున్నారు. మరికొందరు డ్రైవర్లు మద్యం మత్తులో ఆటోలు నడుపుతున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలాంటి తప్పిదాల వల్ల ప్రమాదాలు తరచూ జరుగు తున్నాయనే ఆరోపణలున్నాయి. ద్విచక్ర వాహనాల్లో భార్యాభర్తలు వెళుతున్న సమయంలో వారి వెనుక ఆటోల్లో వేగంగా వస్తూ పెద్దగా హారన్లు కొడుతూ విసిగిస్తున్నారని పలువురు పేర్కొంటున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఏమి ఆటో తగిలిందా అంటూ బెదిరిస్తున్నారని చెబుతున్నారు. ఇవన్నీ అధికారుల దృష్టికి వెళ్లినా వారు పట్టించుకోలేదనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఇలాంటి వాటిపై సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మైలవరం నుంచి పెన్నానదికి నీరు విడుదల

పరీవాహక ప్రాంత వాసులు అప్రమత్తంగా ఉండాలి : జలాశయం ఎఇఇ వై.గౌతమ్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

శ్రీశైలం బ్యాక్ వాటర్ నుంచి వరద నీటిని మళ్లించడం వల్ల గండికోట రిజర్వాయర్ 25 టీఎంసీలు, మైలవరం రిజర్వాయర్ 5.5 టీఎంసీలకు చేరుకోనుందని మైలవరం జలాశయం ఎఇఇ వై.గౌతమ్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం రిజర్వాయర్ నుండి పెన్నా నదిలోకి నీటి విడుదలలో క్రమంగా పెంచుకుంటూ పోతామన్నారు. సోమవారం సాయంత్రం 4గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లోలను 500 క్యూసెక్కుల నుండి 1000 క్యూసెక్కులకు, 10న మంగళవారం సాయంత్రం 4గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లో 1000 క్యూసెక్కుల నుండి 3000 క్యూసెక్కులకు, 11న బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లో 3000 క్యూసెక్కుల నుండి 5000 క్యూసెక్కులకు, 12న గురువారం సాయంత్రం నాలుగు గంటలకు పెన్నా నదికి ఔట్ ఫ్లో 5000 క్యూసెక్కుల నుండి 8500 క్యూసెక్కులకు పెంచుకుంటూ పోతామన్నారు. జమ్మలమడుగు ఆర్డీఒ, డిఎస్పీతోపాటు తహశీల్దార్, ఎంపిడిఒలు ఆదినిమ్మాయిపల్లి ఆనకట్ట వరకు పెన్నా నది వెంబడి నివసించే ప్రజలను దండోరా లేదా ఏదైనా కమ్యూనికేషన్ ద్వారా అప్రమత్తం చేయాలని ఆయన సూచించారు. పెన్నా నది క్రాసింగ్ వద్ద గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రజలను పెన్నా నదిలోకి అనుమతించవద్దని కోరుతున్నామన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు సరైన అవగాహన కల్పించాలన్నారు. ధోబీలను కూడా అనుమతించవద్దన్నారు. పెన్నా నది నుండి మోటర్లు, పైపులు, స్టార్టర్లను తొలగించడానికి రైతులను అప్రమత్తం చేయాలని కోరారు. జమ్మలమడుగు, ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని పెన్నా నది వెంబడి ఉన్న ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. మున్ముందు ఔట్‌ఫ్లోలు కూడా 8500 క్యూసెక్కుల కంటే ఎక్కువగా ఉంటాయన్నారు. మైలవరం రిజర్వాయర్ క్యాచ్‌మెంట్ ఏరియాలో వర్షపాతం మీద ఆధారపడి ఉంటుందని ఆయన వివరించారు.

భక్తిశ్రద్ధలతో వినాయక నిమజ్జనం

సీతారామపురం వద్ద కుందూ నదిలో నిమజ్జనం చేస్తున్న వినాయకుడి ప్రతిమ

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని సీతారాంపురం, అన్నవరం గ్రామాల వద్ద కుందూ నదిపై గణనాథుని నిమజ్జనాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వినాయక చవితి సందర్భంగా వాడవాడలా వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసి పూజలు నిర్వహించారు. సోమవారం మూడవరోజు కావడంతో అధిక సంఖ్యలో వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రజలు ఘనంగా నిర్వ హించారు. మండలంలోని గ్రామాలతోపాటు ప్రొద్దుటూరు, మైదుకూరు ప్రాంతాల నుండి అధిక సంఖ్యలో వినాయక ప్రతిమలను నిమజ్జనానికి తీసుకువచ్చారు. కుందూ నదిలో నీటి ప్రవాహం అధికంగా ఉండడంతో డిఎస్పి రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మైదుకూరు రూరల్ సీఐ జె శివశంకర్, ఎస్ఐ చిన్నపెద్దయ్య బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ప్రజలు నదిలోకి దిగ కుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో నిమజ్జనానికి ఇబ్బం దులు కలగకుండా లైటింగ్ ఏర్పాట్లు చేపట్టారు. మహిళలు, యువకులు నిమజ్జన కార్యక్రమంలో అధిక సంఖ్యలో పాల్గొన్నారు. నిమజ్జనం సందర్భంగా ట్రాక్టర్లలో ప్రసాదాలు పంచిపెట్టారు.

వేంపల్లె : వినాయక విగ్రహ నిమజ్జనాని నిర్వాహకులు ఘనంగా చేశారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమలను ప్రధాన రహదారుల్లో గ్రామో త్సవంగా నిమజ్జనానికి తరలించారు. అన్న దానాలు ఏర్పాటు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగ కుండా ఎస్ఐ తిరుపాల్ నాయక్, ఎఎస్ఐ రాజ శేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆయా ప్రాంతాల్లో వినాయక విగ్ర హాల వద్ద తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి రవి తేజా రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ రామ మునిరెడ్డి, మహమ్మద్ షబ్బీర్, వేమా కుమార్ పూజలు చేశారు. మండపాల నిర్వాహకులు టిడిపి నేతలైన రవితేజా రెడ్డి, రామమునిరెడ్డి, యువనేత రజనీకాంత్ రెడ్డిని శాలువతో సత్కరించారు.

సింహాద్రిపురం : మండల వ్యాప్తంగా వినాయక నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహించారు. సింహాద్రిపురంతోపాటు పలు గ్రామాలలో మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు అనంతరం ఊరేగింపుగా తీసుకెళ్లి సమీపంలోని వాగులలో, నీటి కుంటలలో నిమజ్జనం చేశారు.

జమ్మలమడుగు రూరల్ : వినాయకుడికి ప్రజలు మూడవ రోజు ఘనంగా వీడ్కోలు పలికారు. పట్టణం, మండలంలోని గ్రామాల నుంచి పెన్నానదికి, ఆయా గ్రామాల చెరువులు, కుందూ నదికి వినాయక విగ్రహాలు నిమజ్జనానికి తరలివెళ్లాయి. పి.బొమ్మేపల్లి గ్రామంలో వినాయకుడి లడ్డూ రూ.30 వేలకు పరమేశ్వరరెడ్డి దక్కించుకున్నారు.

ఖాజీపేట : మండల ప్రజలందరూ వినాయక చవితి పండుగను మూడు రోజులు పాటు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం గ్రామోత్సవం, నిమజ్జనం చేశారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన కోలాటం, నృత్యాలు అందరినీ అలరించాయి. ఆంజనేయ కొట్టాలు సమీప చెరువులో గణనాథుడి నిమజ్జనం జరిగింది. ధాంఖాన్ పల్లెలో వినాయక లడ్డూ వేలం వేయగా సర్పంచ్ గడ్డం చిన్న గంగన్న దక్కించుకున్నారు. దుంపలగట్టులో లడ్డూ వేలం పాటను మల్లెం అరుణ్‌కుమార్‌రెడ్డి రూ.72 వేలకు దక్కించుకున్నారు. లక్ష్మిమాల (డబ్బుల దండ) రూ.43 వేలకు రెడ్యం శ్రీకాంత్‌రెడ్డి, వెండి గిన్నెను రూ.27 వేలకు రెడ్యం సునీల్‌కుమార్ రెడ్డి దక్కించుకున్నారు.

వేలంలో రూ.1.40 లక్షలు పలికిన లడ్డూ

మైదుకూరు : తిప్పిరెడ్డిపల్లిలో వినాయక చవితి సంద ర్భంగా సోమవారం లడ్డూ వేలం పాట నిర్వహించగా.. అదే గ్రామానికి చెందిన బైరిశెట్టి గురు ప్రసాద్(టైగర్)రూ.1.40 లక్షల హెచ్చు పాటపాడి లడ్డూను దక్కించుకున్నారు. కలశం చెంబును ఉమ్మడిశెట్టి రాము రూ.53 వేలకు, చెరకు గడలను కోటయ్యగారి గురుమోహన్ రూ.23వేలకు, వెండి బిళ్లను ఆకుల నడిపి సుబ్బారాయుడు రూ.11వేలకు దక్కించుకున్నారు. గ్రామోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు. గణనాథుని గ్రామ సమీపంలోని బ్రహ్మసాగర్ ప్రధాన కాలువలో నిమజ్జనం చేశారు.



వైద్య సేవలపై రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్

వైద్య సేవలపై కలెక్టర్ ఆరా

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందులలో నూతనంగా ఏర్పాటు చేసిన జిజిహెచ్, మెడికల్ కళాశాలను కలెక్టర్ శివశంకర్ లోతేటి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి జనరల్ హాస్పిటల్, టీచింగ్ హాస్పిటల్‌లో మౌలిక సదుపాయాలు, ఓపి, ఐపి బ్లాకులు, ఎమర్జెన్సీ వార్డులతో పాటు.. పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఏపీఎం ఎస్ఐడిసి కల్పించే సదుపాయాలు, వైద్య సిబ్బంది సంఖ్య తదితర వివరాలను ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఉన్న రోగులతో వైద్య సదుపాయాలు, వైద్యులు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

గండ్లూరులో ఘర్షణ

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురం మండలంలోని గండ్లూరు గ్రామంలో వినాయకుడి నిమజ్జనం సందర్భంగా సోమవారం రెండు గ్రూపుల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ఎలాంటి సమస్య లేకుండా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు.

నిరసన వ్యక్తం చేస్తున్న ఎంపిజె సభ్యులు

ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

మూవ్ మెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె) తరపున రాష్ట్రవ్యాప్తంగా వైద్య, ఆరోగ్య, మాదకద్రవ్యాలపై ఈనెల 1 నుంచి 15 తేదీ వరకు ఉద్యమాన్ని నిర్వహిస్తోందని ఎంపిజె రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సలీం తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం తహశీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సలీం మాట్లాడుతూ వైద్య, ఆరోగ్య, మాదకద్రవ్యాలపై ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ చూపాలని కోరారు. రాష్ట్ర ప్రభుతం ఎన్టీఆర్ వైద్య ఆరోగ్యశ్రీ ద్వారా ఆసుపత్రిలో ఉచితంగా వైద్య సేవలు గ్రామీణ, ఏరియా, హాస్పిటల్స్‌లో రోగులకు అవసరమైన సౌకర్యాల కల్పించాలన్నారు. అర్హులైన వారికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మెరుగైన సేవలను అందిం చాలన్నారు. మద్యపాన నిషేధం, అత్యాచారాలకు కారణమవుతున్న అశ్లీల వెబ్‌సైట్లు, గంజాయి, డ్రగ్స్‌ను నిషేధించాలన్నారు. పంచాయితీ, మున్సిపల్, కార్పొరేషన్లలో పరిశుభ్రతను పాటించేలా మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. రాష్ట్రంలోని మెడికల్ షాపులలో నిషేధిత, ఎక్స్‌పైర్ అయిన మందుల విక్రయాలను అరికట్టాలన్నారు. ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్న హెూటల్స్, స్వీట్, బేకరీ షాప్‌లపై, కాలం చెల్లిన తినుబండరాలు, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పరిశీలించి చర్యలు తీసుకునేలా సూచించారు. నకిలీ విత్తనాలు, మందులు అమ్మేవారి పట్ల కఠిన చర్యలు తీసుకునేలా వ్యవసాయ అధికారులను అప్రమత్తం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపిజె జిల్లా అధ్యక్షుడు జాకీర్, పట్టణ అధ్యక్షుడు హుస్సేన్‌బాషా, కార్యదర్శి మహమ్మద్ రఫీ, కోశాధికారి ఇస్మాయిల్, అస్లాం జమాతే ఇస్లాం హింద్ సభ్యులు మొహిద్దీన్, పట్టణ అధ్యక్షుడు షఫీ వుల్లాహ్, అల్లా బకాష్, బాదుల్లాహ్ పాల్గొన్నారు.

పత్తి పంట పరిశీలనానంతరం సూచనలిస్తున్న అధికారులు

పత్తిలో సస్యరక్షణ చర్యలపై అవగాహన

ప్రజాశక్తి - ఖాజీపేట

పత్తిలో గులాబీ రంగు పురుగు, దోమ ఎక్కువవుతోందని, వాటి నివారణకు క్వినాల్ పాస్, క్లోరో పైరిపాస్ ఒక లీటర్ నీటికి 2.5 ఎంఎల్, ప్రొపైనొపస్ ఒక లీటరు నీటికి రెండు ఎంఎల్ చొప్పున పిచికారి చేస్తే ఆశించిన ఫలితాలు లభిస్తాయని వ్యవసాయ శాస్త్రవేత్త వీరయ్య, డిఆర్సి ఎడి రమణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తుడుమలదిన్నె, సుంకేసుల, తవ్వారిపల్లె గ్రామాల్లో వ్యవసాయాధికారులు పత్తి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పత్తిలో గులాబీ రంగు పురుగు, దోమ ఉధృతి అరికట్టుటతోపాటు రైతులకు సస్యరక్షణ చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో ఎఒ నాగార్జున, ఆదర్శ రైతులు, సచివాలయ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా 'ఆకుపచ్చముగ్గు'

రచయిత వేంపల్లె షరీఫ్‌కు అరుదైన గౌరవం

ప్రజాశక్తి - వేంపల్లె



వేంపల్లెకు చెందిన కథా రచయిత, కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కార గ్రహీత వేంపల్లె షరీఫ్ రాసిన 'ఆకుపచ్చ ముగ్గు' కథను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ విద్యార్థులకు పాఠ్యాంశంగా ఎంపిక చేసింది. ఆ మేరకు కళాశాల విద్యా కమిషనర్ పోలా భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది నుంచి సామాజిక శాస్త్రాలు చదువుతున్న డిగ్రీ విద్యార్థుల్లో యునెస్కో ప్రతిపాదించిన శాంతి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు ప్రత్యేకంగా ఒక పేపరును 50 మార్కుల కోసం ప్రవేశపెట్టారు. ఇందులో భాగంగా సమాజంలో శాంతి సామరస్యాలు పెంపొందించేందుకు వీలుగా ఉన్న వేంపల్లె షరీఫ్ రాసిన కథ 'ఆకుపచ్చ ముగ్గు'ను ఎంపిక చేశారు. ఇకపై బిఎ, బికాం, బిఎస్సీ, బిబిఎ విద్యార్థులు మూడవ సెమిస్టర్ కింద చదువుకోవాల్సిన పాఠ్యాంశాల్లో ఈ కథ కూడా ఉంది. మధ్య తరగతి ముస్లిం కుటుంబంలో పుట్టి కష్టపడి చదువుకుని పైకొచ్చి రచనలు చేస్తున్న షరీఫ్ ఇప్పటికే 2012లో తన 'జుమ్మా' కథా సంకలనం కోసం కేంద్ర సాహిత్య అకాడెమి యువ పురస్కారం పొందారు. ఇప్పటిదాకా ఎనిమిది పుస్తకాలు రచించిన ఆయన కథలు హిందీ, ఇంగ్లీషు, కన్నడ, తమిళం, మల యాళం, కొంకణి, మైథిలి భాషల్లోకి అనువాదమయ్యాయి. జర్నలిజంలో పిహెచ్‌డి చేసి స్కాలర్‌గా కూడా రాణించారు. ఆయన ప్రచురించిన పరిశోధన పుస్తకం 'టీవీ ప్రకటనల్లో భాష-సంస్కృతి' ఇప్పటికే పలు యూనివర్సిటీల్లో జర్న లిజం, ఎంబిఎ విద్యార్థులకు రెఫరెన్స్ పుస్తకం కింద ఉంది. షరీఫ్ రచనల్లో ఎక్కువగా మత సామరస్య అంశాలు ఉంటాయని విమర్శకులు చెబుతారు. ఇంటి ముందు ముగ్గులేసే ఒక ముస్లిం ఆడపిల్ల తర్వాత ఆ పని మానేసి అరచే తుల్లో గోరింటాకుతో ముగ్గులు వేస్తుంటుంది. ఒక మతానికి మరో మతానికి ఇంతే తేడా, దీని కోసం ఎవరూ భేషజాలకు పోవాల్సిన పని లేదని సూచించే ఈ కథను గొప్ప సామరస్య రచనగా పాఠ్యాంశ రూపకర్తలు పేర్కొన్నారు. ఈ సెమిస్టర్‌లో వేంపల్లె షరీఫ్ కథతోపాటు రావిశాస్త్రి రాసిన 'పిపీలికం', పోలా ప్రగడ రాజ్యలక్ష్మి రాసిన 'నల్లపూసలు', పెనుమాక రత్నాకర్ రాసిన 'ఈ పొలం అమ్మబడును' రచనలు పాఠ్యాంశాలుగా ఎంపికయ్యాయి. రావిశాస్త్రి వంటి గొప్ప కథలతోపాటు తన కథను ఎంపిక చేసినందుకు రచయిత వేంపల్లె షరీఫ్ ఈ సందర్భంగా పాఠ్యాంశ రూపకర్తల కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

మహారాజశ్రీ అదనపు సీనియర్ సివిల్ జడ్జీ వారి కోర్టులో, కడప

I.P. No. 56 of 2020.

షేక్ ఖాదర్ బాషా S/o. గౌసాన్, వయసు 50 సం.లు, 9/581-B, అగాడి వీధి, కడప. ...పిటీషనర్

Vs

బొమ్మి భాగ్యలక్ష్మి W/o బాల రామయ్య, వయస్సు 40 సం.లు, డోర్ నెం.40/54, ఉక్కాయపల్లి లేఔట్, చిన్నచౌక్, కడప నగరం. ...రెస్పాండెంట్ నెం.3

NOTICE TO RESPONDENT NO. 3

ఇందుమూలముగా తెలియజేయడము ఏమనగా, పై కోర్ట్ నందు పిటిషనర్ అయిన షేక్ ఖాదర్‌బాషా తనకి ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేరు చేయమని తన తరుపున ఇన్‌సాల్వెంసి పిటిషన్, మీపైన మరియు ఇతర రెస్పాండెంట్ల పైన దాఖలు చేసి ఉన్నాడు. మీకు పలుమార్లు కోర్ట్ వారు నోటీసు జారి చేసి ఉన్నా మీరు ఉద్దేశ పూర్వకముగా తీసుకోవడం లేదు. కావున మీకేమైనా ఆక్షేపణలున్న యెడల 11-09-2024 వ తేదీన ఉదయము 10:30 గం.లకు మీరు పై కోర్ట్ నందు హాజరై మీరు స్వయాన గాని మీ తరుపున వకీలు ద్వారా గాని తెలుపుకోవచ్చును. లేని యెడల మీ పరోక్షములో తీర్మానించబడుతుంది.

//By Order of the Court//

ఎం. షానవాజ్ ఖాన్,

పిటీషనర్ తరపు అడ్వకేట్, కడప.

మహారాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జిగారి కోర్టులో

O.S.No.25/2024

గూడూరు మహబూబ్ బీ W/o జి.హుసేన్ బాషా, డి.నెం.20/690, మోడమీదిపల్లి, ప్రొద్దుటూరు టౌన్, వైఎస్ఆర్ కడప జిల్లా ...వాది

VS

కల్లూరు మస్తాన్ బీబి W/o గూడూరు మహబూబ్ హుస్సేన్ డి.నెం.10/129-2-7-2,వనిపెంట రోడ్, మైదుకూరు టౌన్ మరియు మునిసిపాలిటి,వైఎస్ఆర్ కడప జిల్లా ...ప్రతివాది

దావా సమను

ప్రొనోటు బాకీ వసూలు కొరకు పైకోర్టు నందు **O.S.No.25/2024** నెంబరు దావాను మీపై దాఖల చేసి ఉన్నారు. సదరు దావా మీ హాజరు కొరకు **20-09-2024వ** తేదీన వాయిదా వేసి ఉన్నారు. కావున ఆ దినము ఉదయం **10-30 గంటలకు** మీరు పైకోర్టుకు నేరుగా గాని లేక మీ తరపు న్యాయవాది ద్వారా గాని హాజరయి మీ అభ్యంతరములు తెలుపు కొనవచ్చును. అట్లు మీరు హాజరు కాని యెడల మీ పరోక్షమున ఎక్సపార్టీగా తీర్పు తీర్మానించబడును.

By order of the court

Sri **M.Karimulla Ali Baig**,

Advocate, Proddatur

రాజశ్రీ ప్రొద్దుటూరు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు నందు

O.S.No. 77/2023

Annabathina Lakshmi Kameswaramma, 71 Years, W/o Annabathina Nageswara Rao, Hindu, Household Duties, R/o D.No.6-387-E, Upstairs, Opp.LG Service Centre, BS Hall Street, Rajampeta Town and Mandal-516115, Annamayya District, AP. ...వాది

Vs

1. Medam Siva Rami Reddy
2. Bana Vishnu Gopal Reddy
3. Nagalapati Purushotham Kumar
4. Vankam Lakshmi Narayana
5. Marthala Kishore Kumar Reddy
6. Jinka Venugopal.

...ప్రతివాదులు

5వ ప్రతివాదికి సమను మరియు 5వ రెస్పాండెంట్‌కు నోటీసు

To, D5/R5 Marthala Kishore Kumar Reddy, 24 సం॥లు, S/o మార్తల చలమారెడ్డి, హిందూ, వ్యాపారం, R/o.D.No.23/568, Nagalakatta Street, Jammalamadugu Town And Mandal-516434, YSR District, AP.

పై వాది పైన తెలిపిన 5 మంది ప్రతివాదులపైన దావా షెడ్యూలా ఆస్తి పైన తనకు గల Right and Title ని డిక్లేర్ చేయమని మరియు పర్మనెంట్ ఇంజక్షన్, Cancellation of Regd.Sale Deed వగైరా కోరుచూ పై దావాను మరియు I.A.No.1194/2023 & I.A.No.1195/2023 పిటిషన్లను దాఖలు చేసినది. కాబట్టి నీవు 04.10.2024వ తేదీన ఉ॥10.30 గం॥లకు పై కోర్టు నందు హాజరయ్యి నీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేనంతట పై దావా మరియు పిటిషన్లు నీ పరోక్షమున తీర్మానించబడును.

వాయిదా తేది: 04.10.2024

//కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

వి.రమేష్‌బాబు

అడ్వకేట్, ప్రొద్దుటూరు.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE :KADAPA

O.S.No. 503/2022

1) Kuncham Vamsidhar Reddy, S/o. Late Kuncham Rami Reddy, aged about 20 years, Hindu, Student ;
2) Kuncham Nikitha, d/o. Late Kuncham Rami Reddy, aged about 15 years, Hindu, Minor ;
3) Kuncham Sulochana, w/o. Late Kuncham Rami Reddy, aged about 36 years, Hindu, House wife
No.2 is minor, represented by her mother and natural guardian namely Kuncham Sulochana i.e., No.3 here in.
All are residents of D/No.5/43A, G.Obayapalle, H/o. Koppolu Village, Valluru Mandal, Kadapa District. ...Plaintiffs

Vs

D7- Kodathala Pratap Reddy, S/o. Late Kodathala Narayana Reddy, aged about 55 years, Hindu, resident of Sunnapurallapalle Villagge, Yerragun tla Mandal, Kadapa District.

SUMMON TO DEFENDANT NO.7

పై తెల్పిన వాదులు,ప్రతివాది నెం.7 అయిన మీ పైన మరియు ఇతరులపైన పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో ప్రతివాది నెం.7 అయిన మీరు హాజరు అగుటకు గాను వాయిదాను 25/9/2024 వ తేదికి వేసి యున్నారు. కావున సదరు దావాలో పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట 25/9/2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేనంతట మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

//By the Order of Hon'ble Court//

ఎమ్. వెంకటరమణ

అడ్వకేట్, కడప.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE :KADAPA

I.A.No. 517/2022

O.S.No. 503/2022

1) Kuncham Vamsidhar Reddy, S/o. Late Kuncham Rami Reddy, aged about 20 years, Hindu, Student ;
2) Kuncham Nikitha, d/o. Late Kuncham Rami Reddy, aged about 15 years, Hindu, Minor ;
3) Kuncham Sulochana, w/o. Late Kuncham Rami Reddy, aged about 36 years, Hindu, House wife
No.2 is minor, represented by her mother and natural guardian namely Kuncham Sulochana i.e., No.3 here in.
All are residents of D/No.5/43A, G.Obayapalle, H/o. Koppolu Village, Valluru Mandal, Kadapa District. ...Petitioner/Plaintiffs

Vs

R7/D7-Kodathala Pratap Reddy, S/o. Late Kodathala Narayana Reddy, aged about 55 years, Hindu, resident of Sunnapurallapalle Villagge, Yerragun tla Mandal, Kadapa District.

NOTICE TO RESPONDENT NO.7/ DEFENDANT NO.7

పై తెల్పిన వాదులు, ప్రతివాది నెం.7 అయిన మీ పైన మరియు ఇతరులపైన పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట I.A.No. 517/2022 అను పిటీషను దాఖలు చేసి యున్నారు. సదరు పిటీషన్‌లో రెస్పాండెంట్ పిటీషన్ నెం.7 అయిన మీరు హాజరు అగుటకు గాను వాయిదాను 25/9/2024వ తేదికి వేసి యున్నారు. కావున సదరు పిటీషన్‌లో పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట 25/9/2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారా గాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపుకొనగలరు. లేనంతట మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

//By the Order of Hon'ble Court//

ఎమ్. వెంకటరమణ

అడ్వకేట్, కడప.

IN THE COURT OF THE HON'BLE III ADDITIONAL JUNIOR CIVIL JUDGE :KADAPA

I.A.No. 518/2022

O.S.No. 503/2022

1) Kuncham Vamsidhar Reddy, S/o. Late Kuncham Rami Reddy, aged about 20 years, Hindu, Student ;
2) Kuncham Nikitha, d/o. Late Kuncham Rami Reddy, aged about 15 years, Hindu, Minor ;
3) Kuncham Sulochana, w/o. Late Kuncham Rami Reddy, aged about 36 years, Hindu, House wife
No.2 is minor, represented by her mother and natural guardian namely Kuncham Sulochana i.e., No.3 here in.
All are residents of D/No.5/43A, G.Obayapalle, H/o. Koppolu Village, Valluru Mandal, Kadapa District. ...Petitioner/Plaintiffs

Vs

R7/D7-Kodathala Pratap Reddy, S/o. Late Kodathala Narayana Reddy, aged about 55 years, Hindu, resident of Sunnapurallapalle Villagge, Yerragun tla Mandal, Kadapa District.

SUMMON TO RESPONDENT NO.7/ DEFENDANT NO.7

పై తెల్పిన వాదులు, ప్రతివాది నెం.7 అయిన మీ పైన మరియు ఇతరులపైన పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట I.A.No. 518/2022 అను పిటీషన్ దాఖలు చేసియున్నారు. సదరు పిటీషన్‌లో రెస్పాండెంట్ పిటీషన్ నెం.7 అయిన మీరు హాజరు అగుటకు గాను వాయిదాను 25/9/2024వ తేదికి వేసి యున్నారు. కావున సదరు పిటీషన్‌లో పై తెల్పిన రాజశ్రీ కోర్టు వారి యెదుట 25/9/2024వ తేదీన ఉదయం 10.30 గం॥లకు స్వయముగా గాని లేదా వకీలు ద్వారాగాని హాజరై మీకు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలుపు కొనగలరు.లేనంతట మీ పరోక్షమున కేసు తీర్మానించబడును.

//By the Order of Hon'ble Court//

ఎమ్. వెంకటరమణ

అడ్వకేట్, కడప.